మహిళలు స్వశక్తితో ఎదగాలి

ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదల ముఖంలో చిరునవ్వు : నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- కుప్పం

మానవసేవయే మాధవసేవ అని ఎన్టీఆర్ నమ్మారని, దాన్నే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆచరిస్తోందని నారా భువనేశ్వరి అన్నారు. ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు చేయూత అందిస్తున్నమని చెప్పారు. మహిళలు స్వశక్తితో ఎదిగి సత్తా చాటాలని సూచించారు. 4వ రోజు కుప్పం నియోజకవర్గం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు.

కుప్పంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొని 48 కుట్టుమిషన్లు, 30 తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ సమాజసేవకే అంకితం. ట్రస్ట్ ద్వారా నాలుగు బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్నాం. 5 లక్షల రక్తదాన శిబిరాల ద్వారా 9 లక్షల మందికి సురక్షితమైన రక్తదానం చేస్తున్నాం. తలసేమియా వ్యాధిగ్రస్తులకు అండగా నిలబడుతున్నామని, ఎన్టీఆర్ సంజీవని క్లినిక్ ద్వారా 2 లక్షల మందికి పైగా ఉచిత వైద్య సేవలు అందించామని తెలిపారు. మొబైల్ క్లినిక్ ద్వారా గ్రామీణ ప్రాంత వాసులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, 2,114 మంది చిన్నారులకు విద్య అందిస్తున్నామని, విద్యార్థులకు స్కాలర్ షిప్ ల కోసం రూ.మూడున్నర కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. కుప్పంలోని స్త్రీ శక్తి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ద్వారా 7,775 మహిళలకు టైలరింగ్, జూట్ బ్యాగ్, మగ్గం, చికెన్ కారి వర్క్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ సుజల పథకం కింద మూడు క్లస్టర్లు నడుస్తున్నాయని, న్యూట్రిఫుల్ యాప్ ను అందుబాటులోకి తెచ్చామని, మహిళల ఆర్థిక ప్రగతిలో భాగంగా స్వయం ఉపాధిలో శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

సరదాగా బోట్ షికారు

కుప్పం పరిధిలోని శ్రీ కనక నాంచారమ్మ ఆలయాన్ని నారా భువనేశ్వరి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.8కోట్లు విడుదల చేయగా ఆలయానికి రాకపోకలు సాగించేందుకు అవసరమైన కట్ట నిర్మాణానికి తన వంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాలారు నదిలో బోటు షికారు చేశారు. దాసే గౌనూరు గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో ముఖాముఖిలో మాట్లాడుతూ.. ఇక్కడ 427 మందికి పింఛన్లు అందుతున్నాయన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ ద్వారా రూ. కోటి 70 లక్షల వ్యయంతో 96 గృహాలు నిర్మించాం, గ్రామాభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి రూ.2 కోట్ల 26 లక్షల విడుదల చేశారని తెలిపారు. అర్హులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం కింద ఆర్థిక సాయం, గోకుల షెడ్లు నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం ఉండకూడదని చంద్రబాబు కష్టపడుతున్నారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో భారీ ఎత్తున ఎంవోయులు కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో పీకెఎం ఉ డా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, ఏపీ ఐఐసీ ప్రేమ్‌కుమార్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రాజగోపాల్, రాష్ట్ర నేత గోపినాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, జనసేన నరేష్, రెస్కో డైరెక్టర్లు తులసి, అనసూయ శివ పాల్గొన్నారు.

టీ షాపును ప్రారంభిస్తున్న సందర్భంగా

రైతుకు ఊరటనిస్తున్న చిక్కుడు

- ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఆశాజనకంగా ధరలు

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం):

గత రెండేళ్లుగా టమాటా, మామిడి, ఇతర పంటలతో నష్టపోయిన రైతులు తక్కువ ఆదాయంతో ఎక్కువ లాభం వచ్చే పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తీగజాతి పంటల సాగుపై మొగ్గుచూపుతున్నారు. తీగజాతి చిక్కుడు సాగు సులభతరంగా ఉండటి తక్కువ ఖర్చుతో మంచి లాభాలు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మండలంలో అధిక శాతం రైతులు తీగ జాతి చిక్కుడు, కీర దోసకాయలను అధికంగా సాగు చేస్తున్నారు. భూమా నాణ్యత బాగుంటే చిక్కుడు దాదాపు ఏడాది వరకు దిగుబడి ఇస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో చిక్కుడు ధర కేజీ రూ.60ల వరకు వస్తోంది. కీర దోస కేజీ రూ.40ల వరకు ధర పలుకుతోంది.

గతంలో టమాటా పంట సాగుచేసి సరైన ధరలేక పెట్టుబడి కూడా రాకుండా తీవ్రంగా నష్టపోయామని ప్రస్తుతం చిక్కుడు, కీర దోస పంటలను సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ పంటకు ఒకటున్నర ఎకరా పంటకు రూ.25వేలు ఖర్చు అవుతోందని, మూడు కోతల్లోనే పెట్టిన పెట్టుబడి వచ్చిందని ఇకపై వచ్చే లాభం ఆదాయమని రైతు తెలిపారు. రైతు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తనకున్న రెండు ఎకరాల్లో కీరదోస పంట సాగు చేయడం జరిగిందని, తక్కువ పెట్టుబడి పెట్టినట్లుటికే 40రోజుల్లోనే పంట చేతికి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో కీరదోస ధర కూడా బాగానే వస్తుందని ఆనందం వ్యక్తం చేశారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టండి

సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు

సమావేశంలో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నియోజకవర్గం కుప్పంపై దృష్టి పెట్టినట్లు జిల్లా అంతా దృష్టి పెట్టాలని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు సిపిఎం జిల్లా కార్యాలయంలో సురేంద్ర అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రజాసమస్యలపై జిల్లా అభివృద్ధిపై సిపిఎం పోరాటం చేస్తున్నదని, దశలవారీగా కార్యక్రమాలను రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో చిత్తూరు జిల్లాలోని ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద 13 గంటల పనివిధానాన్ని తీసుకురావడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనిగంటల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రం అభివృద్ధి విషయంలో గతంలో ఇచ్చిన హామీలను అమలకు నోచుకోలేదని వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. జిల్లాలో గత ప్రభుత్వంలో పేదలపై భూ సమస్యలు పరిష్కారం కాకుండా ఇబ్బందులు పెట్టిన పరిస్థితిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వెసులుబాటు ఉంటుందనుకున్న ప్రజల ఆశలు నీరుగారిపోయాయని అన్నారు. జిల్లా ప్రజానీకం రోజురోజు భూ సమస్యలతో సతమవుతమవుతున్నారని ప్రతి సోమవారం కలెక్టరేట్ వద్ద సమస్యలు పరిష్కరించడం లేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి జిల్లాలో నెలకొందని అన్నారు. సీఎం సొంత జిల్లాలోనే ఇలా ఉంటే రాష్ట్రమంతా ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు అన్నారు. భూ సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం దశలవారీగా పోరాటాలకు సిద్ధమవుతున్నదని తెలిపారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, షకీలా, భువనేశ్వరి పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - పలమనేరు రూరల్ (గంగవరం):

మండల పరిధిలోని గ్రామీణ రోడ్లు అన్నీ గుంతమయంగా మారి అధ్వానంగా తయారైయ్యాయి. పలమనేరు నుంచి గుండిగుళ్లకు వెళ్లే రోడ్డు అలాగే పలమనేరు నుంచి దండపల్లి మీదుగా వెళ్లే శంకరాల పేట రోడ్డు, గంగ్రాజుపల్లి నుంచి గుండిగళ్లకు వెళ్లే రోడ్డు, పలమనేరు రూరల్ కులమాసినపల్లి నుంచి నెల్లిపట్లకు వెళ్లే దారి, కూర్మాయి మీదుగా పెద్దకపల్లి, జరవరపల్లికి వెళ్లే రోడ్లు అన్ని కూడా ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారాయి. ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా గుంతల్లో నీరు చేరి వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. మరికొన్ని రోడ్లు రాళ్లు తేలిపోవడంతో తరచూ వాహనదారులు అదుపుతప్పి కింద పడి ప్రమాదాల భారిన పడుతున్నారు. గ్రామాల నుంచి రైతులు పండించే పంటలు, కూరగాయలు, దాన్యాలను పలమనేరు మార్కెట్‌కు తరలించాలంటే దాదాపు 15 కిలోమీటర్లు ఉన్నా రోడ్లు సరిగా లేక గంటకుపైగా సమయం పడుతోంది. మండలంలోని ఓ ఆటో యజమాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రోడ్లు బాగా దెబ్బతినడం వలన అరగంట ప్రయాణాన్ని గంటకు పైగా ప్రయాణించాల్సి వస్తోందని, ఆటోలు కూడా బాగా దెబ్బతింటున్నాయని తెలిపారు. కొన్ని చోట్ల ఉన్న మలుపుల్లో ముళ్లకంపలు బాగా పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించగ పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్లు బాగు చేయించాలని కోరారు.

దండపల్లి రోడ్డు రొచ్చు.. రొచ్చు..

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని దండపల్లి రోడ్డు ప్రయాణికులు, వాహనదారులు నడవడానికి కూడా వీలు కాకుండా రొచ్చు రొచ్చుగా అధ్వాన్నంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు పక్కనే ఉన్న సుబ్బరాయుని కుంట నిండిపోయింది. ఎక్కువైన నీరు పలమనేరు పెద్దచెరువుకు వెళ్లే కాలువ ఆక్రమణలకు గురికావడంతో రోడ్డుపైనే నీరు మొత్తం ప్రవహిస్తోంది. అదే రోడ్డులో కలప మిల్లులు ఉండటంతో కలప వాహనాలు వెళ్లి రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చెత్త శుభ్రం చేయడానికి రూ.13కోట్లు

- డంపింగ్‌యార్డులో చెత్త తరలింపు
- ఊపిరి పీల్చుకుంటున్న స్థానికులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసేందుకు ఎట్టకేలకు నగరపాలక సంస్థ పూనుకుంది. చిత్తూరు నగరంలోని మంగసముద్రం హౌసింగ్ కాలనీ వద్ద ఉన్న 16 ఎకరాల డంపింగ్ యార్డులోని పేరుకుపోయిన చెత్తను భారీ యంత్రాల ద్వారా ప్రాసెస్ చేసి తొలగించేందుకు రూ.13 కోట్లను ఖర్చు చేస్తున్నారు. రాష్ట్రంలో 83 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయి. చిత్తూరు నగరపాలక సంస్థకు సంబంధించి నగర సమీపంలోని డంపింగ్ యార్డ్‌లో గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపుకు నగరపాలక సంస్థ పూనుకోవడంతో డంపింగ్ యార్డ్ సమీప ప్రాంతాలైన లెనిన్ నగర్, మంగసముద్రం, ఓబనపల్లి, కోడిగుట్ట, సంతపేట, చవటపల్లి ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నగర సమీపంలోని మంగసముద్రం వద్ద 16 ఎకరాల్లోని డంపింగ్ యార్డ్‌లో గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలతో సమీప ప్రాంతాల ప్రజలు దుర్వాసన భరించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వృద్ధులు, చిన్నారులు వ్యాసకోస వ్యాధుల బారినపడుతున్నట్లు అనేక సందర్భాల్లో నగరపాలక సంస్థకు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతాల్లో పర్యటించిన సందర్భాల్లో వినతి పత్రాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో డంపింగ్ యార్డ్ మార్పు కోసం నగరపాలక సంస్థ ప్రయత్నం ఫలించలేదు.

ప్రజాదృష్టి

ఇంటింటి చెత్త సేకరణ, స్వచ్ఛ చిత్తూరు పేరిట చిత్తూరు నగరంలోని 50 డివిజన్ల నుండి సేకరిస్తున్న చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. ఏళ్ల తరబడి ఇదే ప్రాంతంలో చెత్తను డమ్ చేస్తుండడంతో గుట్టలుగుట్టలుగా పేరుకుపోయింది. రోజుకు 30 టన్నుల మేర చిత్తూరు నగరంలో వ్యర్థాలను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. ఇలా పేరుకుపోయిన చెత్తను డిసెంబర్ చివరి నాటికి పూర్తిస్థాయిలో తొలగించి సుందరవణంగా పార్కును ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ పర్యవేక్షణలో శరవేగంగా డంపింగ్ యార్డ్ వ్యర్థాల శుభ్రత భారీ యంత్రాలతో సాగుతోంది. ఈనెల మొదటి వారంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ చిత్తూరు డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి వ్యర్థాల శుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంతోకాలంగా డంపింగ్ యాడ్ వ్యర్థాలతో అనేక ఇబ్బందులు పడుతున్న చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని మంగసముద్రం, లెనిన్ నగర్, ఓబనపల్లి, సంతపేట, కోడిగుట్ట, చవటపల్లి ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలకు ఉపశమనం కలగనుంది. ఈ ప్రాంతాల్లో పేదలైన భవన నిర్మాణ కార్మికులు, రోజువారి కూలీలు పెద్ద సంఖ్యలో జీవిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన డంపింగ్ యార్డ్ శుభ్రతపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జెసిబిలతో డంపింగ్ యార్డ్ వ్యర్థాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

పాఠశాల మీదుగా వర్షపు నీరు

అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- వెదురుకుప్పంఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, వంకలు, కుంటలు పూర్తిగా నిండి మొరవలు పారుతున్నాయి. అయితే బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని మంచినీళ్ల కుంట చెరువు నీటిపారుదల మొరవ కాలువ లేకపోవడంతో పక్కనే ఉన్న రైతుల పొలాలు, పాఠశాల మీదుగా వర్షపు నీరు ప్రవహిస్తోంది. నిత్యం చెరువు నీరు పాఠశాల ఆవరణలో ప్రవహిస్తు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల మీదుగా చెరువు నీరు రాకుండా కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 50వ వార్డులో నూతనంగా నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ శనివారం ప్రారంభించారు. నగరపాలక పరిధిలో 50వ వార్డులో పంచాయతీ ఆఫీస్ కార్యాలయం వద్ద రూ.9.95 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, ఆర్అండ్ బి కాలనీలో స్థానిక ఏపీ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల వద్ద రూ.10లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే, మేయర్ ఎస్.అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు గతంలో ఎన్నడూ లేనంతగా జరుగుతున్నాయన్నారు. నగర ప్రజల ప్రాథమిక అవసరాలైన రోడ్లు, కాలువలు, వీధి దీపాల ఏర్పాటు పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వం వార్డుల్లో కనీస మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాకే క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కాజూరు బాలాజీ, టిడిపి నాయకులు వెంకటేష్ యాదవ్, లోకేష్ రెడ్డి, నవీన్ కుమార్, నళిని పాల్గొన్నారు.

మైనారిటీ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. శనివారం 50వ వార్డు పరిధిలోని ఏపీ రెసిడెన్షియల్ మైనారిటీ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సౌకర్యాలపై హెచ్ఎం శోభతో మాట్లాడారు. ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న పాఠశాలను కన్నన్ పాఠశాలలోని భవనాల్లోకి మార్చేందుకు కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పాఠశాలలోని బాలికల కోసం రెండు గీజర్లను సొంత నిధులతో అందించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నీళ్లా.. పెట్రోలా..?

- రిపేరు అవుతున్న వాహనాలు
- ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ యాజమాన్య నిర్వాకం
- చర్యలు తీసుకోవాలంటున్న వినియోగదారులు

పెట్రోల్‌తో పాటు నీరు ఉందని చూపుతున్న స్థానికులు

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో శనివారం ద్విచక్ర వాహనాలకు పెట్రోలు నింపుకోగా అందులో పెట్రోల్‌తో పాటు అధిక శాతంలో నీరు కూడా రావడంతో వాహనాలలో పెట్రోల్ పట్టించుకున్న వినియోగదారులు తమ వాహనాలు నీటితో కలిపిన పెట్రోల్ కారణంగా రిపేరై నష్టపోతున్నామని తీసిన ఒక వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్త వైరల్ అయ్యింది.

వివరాల్లోకి వెళితే.. పెద్ద ఉప్పరపల్లె గ్రామ సరిహద్దుల్లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు ఉంది. ఆదివారం ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలలో పెట్రోల్ నింపుకొని వాహనాన్ని స్టార్ట్ చేసి కొద్ది దూరం వెళ్ళగానే ఆగిపోయింది. ఏదో కారణంతో ఆగిపోయింది అనుకున్న ద్విచక్ర వాహనదారులు సమీపంలోని మెకానిక్ షెడ్ల వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ పరిశీలించి చూడగా పెట్రోలు ట్యాంకులో పెట్రోల్‌తో పాటు నీళ్లు కూడా ఉండడం గమనించారు. దీంతో వెంటనే పెట్రోల్ బంకు వద్దకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. దీనికి వారు సమాధానం ఇస్తూ రాత్రి పెట్రోల్ ట్యాంకర్ వచ్చి బంకులోని ట్యాంకులో నింపి వెళ్లిందని తామేమి నీటిని పెట్రోల్‌లో కలపలేదని నిర్లక్ష్యపు సమాధానమిచ్చారు. ఈ విషయాన్ని పలువురి వినియోగదారులు వీడియోలు మాట్లాడుతూ రెండు లీటర్ల పెట్రోల్ బాటిల్‌కు పట్టగా 250 గ్రాముల పెట్రోల్ మాత్రమే ఉందని మిగిలిన ఒక లీటర్ 750 మిల్లీ లీటర్లు మొత్తం నీరు ఉందని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తమకు జరిగిన అన్యాయానికి పెట్రోలు బంకు వారు బాధ్యత వహించి తమ వాహనాలకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని అదేవిధంగా కల్తీ పెట్రోల్ అమ్మకం నిలిపివేసి నాణ్యత కలిగిన పెట్రోల్ అమ్మాలని డిమాండ్ చేశారు.

తనిఖీలు లేక ఇష్టారాజ్యంగా పెట్రోల్ బంకులు

మండలంలో ఐదు పెట్రోలు బంకులు, పెట్రోల్ డీజిల్ అమ్ముతూ వ్యాపారం సాగిస్తున్నారు. ఏ పెట్రోలు బంకులోను మరుగుదొడ్లు శుభ్రంగా లేవు. ఉచితంగా వాహనాల టైర్లకు గాలి పట్టాల్సి ఉండగా ఏ పెట్రోల్ బంకులోను ఉచితంగా గాలి పట్టకపోగా గాలిపట్టే యంత్రం మిషన్, పైపు మాత్రం ఉంటాయి. అవి ఎప్పుడూ మరమ్మతుకు గురయ్యే ఉంటాయని సమాధానం వస్తుంది. గతంలో కూడా పెట్రోలు కొలతల్లో తేడాలు ఉన్నాయని వినియోగదారులు గుర్తించి ఆందోళనలు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. మండలస్థాయి అధికారులు కానీ ఇతర సంబంధిత అధికారులు గానీ తనిఖీలు చేయకపోవడం చేసినా వినియోగదారులకు పెట్రోలు బంకులలో అందాల్సిన సేవలు గురించి అవగాహన కల్పించిన సందర్భం లేకపోవడం కారణంగా మండలంలోని పెట్రోలు బంకుల్లో దోపిడి విచ్చలవిడిగా జరుగుతూ వినియోగదారులను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి వినియోగదారులకు అందాల్సిన సేవలను పెట్రోల్ డీజిల్ కొలతలను తనిఖీ చేసి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

తీరనున్న లో వోల్టేజ్ సమస్య

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వి కోట: మండల పరిధిలోని లింగాపురం వద్ద ఏర్పాటుచేసిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం కావడంతో రైతులకు లో వోల్టేజ్ సమస్య పరిష్కారం అవుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తెలిపారు. శనివరం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొన్నారు. ఆయనకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. సుద్దలకుప్పం నుండి కే.గొల్లపల్లి మీదుగా ఎస్ బండపల్లి వరకు రూ. 1.10 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డుకు భూమి చేశారు. అనంతరం లింగాపురం వద్ద ఏర్పాటుచేసిన 33/11 సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సంస్కరణలను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రజలందరికీ తెలుగుదేశం ప్రభుత్వంలోనే అభివృద్ధి సంక్షేమం అందుతుందన్నారు. మారుమూల ప్రాంతమైన లింగాపురంలో నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా బోయచిన్నగనపల్లి, చింతమాకులపల్లి పంచాయతీలతోపాటు పలు గ్రామాలకు లో ఓల్టేజి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, వైస్ చైర్మన్ విశ్వనాథ్, ట్రాన్స్ కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు శ్రీనివాస మూర్తి, భాస్కర్ నాయుడు, ఏడిఈ జీవన్ కుమార్, రెడ్డి కుమార్, బాబు, పలమనేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, సర్పంచ్ దామోదర్, మాజీ సర్పంచ్ సతీష్ పిఎసిఎస్ చైర్మన్లు హరినాథ్ రెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

24 నుంచి రైతన్న మీకోసం సర్వే

కల్టివేటర్ యాప్‌లో నమోదు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

ఈ నెల 24 నుంచి 29 తేదీ వరకూ అలాగే డిసెంబరు 3న నిర్వహించనున్న రైతన్నా - మీ కోసం కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగా అధికారులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు దిశాదిశ నిర్దేశాలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఆర్ఎస్‌కే పరిధిలోని ప్రతీ రైతు ఇంటికీ ముఖ్యమంత్రి లేఖను అందించటంతో పాటు నిర్దేశించిన పంచ సూత్రాలను కూడా వివరించి చెప్పాలని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్‌లో అత్యుత్తమ సాగు విధానాలు పాటించేలా చైతన్యం కలిగించాలని నిర్దేశించారు. నీటి భద్రతలో భాగంగా భూగర్భ జలాలు, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వల వివరాలతో పాటు సమర్థ నీటి నిర్వహణ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్ లో భాగంగా వాణిజ్య, అంతర ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి సేద్యం గురించి చెప్పాలన్నారు. అగ్రిటెక్‌లో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ వినియోగం, శాటిలైట్ టెక్నాలజీ లాంటి అంశాలు ఉండాలని సూచించారు. మద్ధతు ధరలు, పీఎం కిసాన్, ఇన్ పుట్ సబ్సిడీ, రైతు బజార్లు మార్కెటింగ్ వివరాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ తయారు చేసిన ఫార్మర్ యాప్‌ను ప్రతీ రైతుకూ చేరువ చేయాలని సూచించారు. యాప్ ద్వారా వ్యవసాయ భూమి, పంట సాగు వివరాలు, వాతావరణ సలహాలు, తెగుళ్లకు సంబంధించిన హెచ్చరికలు, మార్కెట్ ధరలు, భూసార పరీక్షలు, మార్కెట్ ఇంటెలిజెన్స్ లాంటి వివరాలను అందించాలన్నారు. రియల్ టైమ్‌లో సమాచారం అందితేనే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, అక్వా కల్చర్ అసిస్టెంట్లు రైతన్నా- మీకోసం కార్యక్రమాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లటంలో వారంతా ముఖ్యపాత్ర పోషించాలని అన్నారు.

ఖాజీలకు ఘనసన్మానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన ఖాజీలు ఇలియాస్ షరీఫ్, ముఫ్తీ సమీయుల్లా, షబ్బీర్ మౌలానాలను నగరంలోని పలు మసీదు కమిటీ నిర్వాహకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జామ్యా మసీదు సెక్రటరీలు ఫహీం బాషా, చాంద్ బాషా, షషవీరాన్ మసీదు ముత్తావల్లి అధ్యక్షులు రెహమాన్, కార్యదర్శి ఎం.అఫ్జల్ ఖాన్, సభ్యుడు ఇలియాస్, ఇమామ్ అబ్దుల్ షకూర్, మదీనా మసీదు అధ్యక్షుడు రహమతుల్లా, బజార్ వీధి చిన్న మసీదు నిర్వాహకుడు అల్తాఫ్ పాల్గొన్నారు. అలాగే మైనార్టీ నాయకులు హిందుస్థాన్ అబ్దుల్ సుభాన్ సాహెబ్, స్టార్ పెయింట్ జిలానీ హాజరై ఖాజీలకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు.

కోదండ రామస్వామి దేవస్థానం

అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం

కోదండ రామస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం అభివృద్ధికి కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కోరారు. చిత్తూరు చర్చి వీధిలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా సి.మధు నాయుడు, మరో 9 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, కూటమి పార్టీల నాయకులు వెంకటేష్ యాదవ్, అట్లూరి శ్రీనివాసులు, ఆరణి కవిత పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

సిఆర్సి సమావేశాల్లో ఎంఈఓల పిలుపు

సమావేశంలో ఎంఈఓ విజయ కుమారి

ప్రజాశక్తి- సోమల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచేందుకు కృషి చేయాలని, బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలో హాజరు శాతాన్ని మెరుగుపరచాలని సోమల, నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సిఆర్సి సమావేశాల్లో మండల విద్యాశాఖ అధికారులు విజయ కుమారి, శివ రత్నమ్మ కోరారు. శనివారం నిర్వహించిన సిఆర్‌సి సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు నిరంతర కృషి చేయాలన్నారు. విద్యాశాఖ ఆదేశాలను తప్పక అమలు చేసే విధంగా ముందుకు సాగాలని ఎంఈఓలు కోరారు. పదవ తరగతి విద్యార్థులు 100శాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశక్తి పథకాన్ని మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతికి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ సత్వ ఇన్ఫోటెక్ సహకారంతో ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద తెలిపారు. ఈ సందర్భంగా సత్వ ఇన్ఫోటెక్ ప్రతినిధులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని, ముఖ్యంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఇంటర్న్‌షిప్‌ల విధివిధానాలు, వాటి ద్వారా లభించే సాంకేతిక నైపుణ్యాలు, భవిష్యత్తులో కల్పించే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గది చదువులకే పరిమితం కాకుండా, ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను ఇప్పుడే నేర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఎల్‌పి.లత, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వంలోనే ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన వీకోట మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ప్రముఖ మైనార్టీ వైసీపీ నేత అక్మల్, వారి సతీమణి వి కోట ఎంపీటీసీ 2 సెగ్మెంట్ రిజ్వానా, మరో వైసిపి నేత ఏకే ఖలీల్ ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున ముస్లిం మైనార్టీలు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీకోట లోని టీపు సర్కిల్ వద్ద శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. వి కోటలో షాదీ మహల్ నిర్మాణం పనుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని త్వరలో పనులు వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు. నూతనంగా పార్టీలో చేరుతున్న మైనార్టీలకు రాబోయే కాలంలో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలను విరివిగా అందిస్తామని మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. పలమనేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, టిడిపి నేతలు ఈశ్వర్ గౌడ్ , సుబ్బన్న, చౌడప్ప, నారాయణస్వామి, రూహుల్ల, ఇక్బాల్, ధీరజ్ పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయంలో శనివారం ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి భక్తుల భజన మండలి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమం ప్రతి శనివారం జరపనున్నట్టు అయ్యప్ప స్వామి భక్తులు తెలిపారు.

రసాయనిక ఎరువులు వాడొద్దు

ముగిసిన మూడు రోజుల శిక్షణా తరగతులు

సోమలలో క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- సోమల: రాబోయే తరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు రైతులు రసాయనిక ఎరువులు పురుగుమందుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి వ్యవసాయ పద్ధతులను పాటించాలని డిజిఎం వాసు కోరారు. మూడు రోజులుగా సోమల శిక్షణా కేంద్రంలో డివిజన్ స్థాయి రైతు సేవా కేంద్ర ఇన్చార్జి విఏఏ, విహెచ్ఏ, విఎస్ఏలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. గ్రీన్ కవర్ కషాయ ద్రావణాలు నవధాన్యాలు విత్తన గుళికల తయారీ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. రెండవ రోజు క్షేత్ర పరిశీలనలో భాగంగా కందూరు పరిసర ప్రాంతాలలో వ్యవసాయ పొలాల వద్దకు తీసుకువెళ్లి కూరగాయలు ఏటీఎం మోడల్ ఘనజీవామృతం ధ్రువ జీవామృతం నిమ్మరస ద్రావణం తదితర అంశాలపై శిక్షణ అందించారు. మూడవరోజు డీజీఎం గోపతి వాసు మాట్లాడుతూ నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్ క్రింద కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పలు గ్రామాలను ఎంపిక చేసిందని వాటిలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్లోని పలు గ్రామాలను ఎంపిక చేయడం ద్వారా ప్రకృతి వ్యవసాయంపై ఎంపిక చేసిన కొత్త గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించడం మెలకువలు నేర్పించడం శిక్షణలో పాల్గొన్న వారికి తెలియజేయడం జరిగిందని ఏక్ పంటకు స్వస్తి పలు పంటలకు స్వాగతం కింద ఒకే పంట వేసే విధానాన్ని కూడా రైతులు మానుకొని పలు పంటలకు స్వాగతం పలకాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పుంగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, సోమల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్, డివిజన్ స్థాయి 45 మంది పాల్గొన్నారు.

పలమనేరు: స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఆర్ఎస్‌కె సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజులుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించగా శనివారం మూడో రోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆర్‌వైఎస్ఎస్ డిపిఎం వాసు ఫీల్డ్ ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించారు. అందరూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించడమే కాకుండా వారి పంటలకు మార్కెటింగ్ చేసుకోవడం గురించి తెలియజేసారు. డిపిఎంయు వాసు, డిపిఎం గురుప్రసాద్, ఎన్ఎఫ్ఏ విజయ, రాజమ్మ, వెంకటేష్, మహేష్, చంద్రశేఖర్, నాగ రమేష్ ,రమేష్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

వివరాలు తెలియజేస్తున్న సదుం తహశీల్దార్ ప్రమీల, ఎంపిడీవో రాధారాణి

ప్రజాశక్తి- సోమల (సదుం): మండల కేంద్రమైన సదుం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23న ఆదివారం ఉదయం 9 గంటల నుండి నిర్వహించనున్న వికలాంగులు, వృద్ధుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సదుం సోమల తహశీల్దార్, ఎంపీడీవోలు ప్రమీల, మధుసూదన్, రాధారాణి, సివిఎస్‌వి ప్రసాద్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు ఆదివారం శిబిరం నిర్వహిస్తున్నామని పింఛనుతో సంబంధం లేకుండా వికలత్వం ఉన్న వికలాంగులు, వృద్ధులకు సహాయ పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, వైద్య ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నాలుగు ఫోటోలు మొబైల్ నెంబర్లు తీసుకురావాలని తెలిపారు. ఈఅవకాశాన్ని రెండు మండలాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణలో మార్పులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఉన్నత పాఠశాలలో క్లస్టర్ మీటింగ్‌లో అన్ని సబ్జెక్టులకు సంబంధించి సమావేశాలు జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాల సుందరం సెకండరీ స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో లీలారాణి మాట్లాడుతూ ఈ నెల నుండి సెకండరీ స్థాయి సమావేశాలు మండల కేంద్రాలకు మార్చడం వలన గత నెల వరకు క్లస్టర్ స్థాయిలో విషయం నిపుణులుగా చేసిన ఉపాధ్యాయులకు ఒక్కొక్క సెషన్‌లో ఒక్కొక్కరికి ప్రణాళికను ఇచ్చి జరపాలన్నారు. ఈనెల నుండి ఆన్లైన్లో వీడియోలు ఉండవని, పదవ తరగతి విద్యార్థులకు సిలబస్ డిసెంబర్ 5 లోపు పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓ బాల సుందరం మాట్లాడుతూ ఒకటి నుండి ఐదో తరగతి సైతం 100 రోజుల కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఏప్రిల్‌లో ప్రతి పాఠశాల తమ విద్యార్థులందరూ పూర్తిస్థాయిలో అభ్యసించినట్లుగా ఒక సర్టిఫికెట్స్ జారీ చేయవలసి ఉంటుందని దీనిపై థర్డ్ పార్టీ తనిఖీలు ఉంటాయని తెలిపారు. జనవరి 26వ తేదీ కాన్స్టిట్యూషన్ డే జరపాలని, ఐదవ తేదీ లోపు చేపట్టే మెగాపేటియం ఎస్ఏ వన్ మూలాంకనం ఆన్లైన్ మార్కులు అప్లోడ్ చేయాలని తెలిపారు. గవర్నమెంట్ సిఆర్సి ప్రధానోపాధ్యాయులు షంషీర్ , మండిపేట కోటూరు ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శ్రీహరి, ఇందిరమ్మ కాలనీ ఉన్నత పాఠశాల మురళి, ఆర్పీలు, సిఆర్ఎంటి హాజరయ్యారు.

ఎస్‌టియు మండల శాఖ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- శాంతిపురం: ఎస్‌టియు శాంతిపురం మండలశాఖ కార్యవర్గ సమావేశం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో శనివారం జరిగింది. జిల్లా ప్రధానకార్యదర్శి మోహన్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం మొండి వైఖరిని వీడి పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలని, బకాయిలు ఉన్న డిఎ, ఓపిఎస్‌లను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన ఎస్‌టియు మండల శాఖ కార్యవర్గను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రాధాకృష్ణ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఉమాపతి, వీరభద్రులను, ఆర్థిక కార్యదర్శిగా చంద్రశేఖర్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా భాస్కర్ రత్నారెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా అశోక్, రవళి, భానుచంద్ర, మనోహర్, మహిళా కార్యదర్శిగా భార్గవాంజలి ఎన్నికయ్యారు. నాయకులు రవి, వెంకట కుమార్, చంద్రమౌళి, గణేష్, పురుషోత్తం, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి మండల విద్యార్థి లిఖిత్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్వహించుచున్న మాక్ అసెంబ్లీ సమావేశానికి మండలంలోని కాలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న లిఖిత్ అనే పదవ తరగతి విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడంతో విద్యార్థి లిఖిత్, విద్యార్థి తండ్రి రామూర్తిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగరాజు, పాఠశాల చైర్మన్ నరేష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

టాస్క్ ఫోర్స్ అదనపు ఎస్పీగా కులశేఖర్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) అదనపు ఎస్పీగా జె. కులశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి ఎఎస్పీ (శాంతి భద్రతలు) గా పని చేశారు. ఆయనను టాస్క్ ఫోర్స్ కు అటాచ్ చేయడంతో శనివారం బాధ్యతలు స్వీకరించారు. తరువాత ఆయన టాస్క్ ఫోర్స్ హెడ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

స్వామిత్వపై గ్రామసభ

ప్రజాశక్తి- సోమల: గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన స్వామిత్వ సర్వేపై ప్రజలకు ఏవైనా అనుమానాలు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని గ్రామసభ నిర్వహించినట్టు పంచాయతీ కార్యదర్శి విశ్వమాలిని తెలిపారు. శనివారం స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఎంపీడీవో సివిఎస్‌వి ప్రసాద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వామిత్వ సర్వే నిర్వహించి గ్రామంలోని ఇండ్ల కొలతలు నమోదు చేయడం జరిగిందని, వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ శివశంకర్, టిడిపి సీనియర్ నాయకులు పిఎం మల్లికార్జున, మహేంద్ర, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలంలోని దిగువ మాఘం, కొండ్రాజుకాల్వ గ్రామంలలో స్వామిత్వ పథకం అమలుపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో డిప్యూటీ ఎంపీడీవో రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు భూసమీకరణ, యాజమాన్య హక్కుల జారీ, డ్రోన్ మ్యాపింగ్ ప్రక్రియ, గ్రామనివాసులకు లభించే ప్రయోజనాలపై అధికారులు వివరించారు. గ్రామ సర్పంచ్ ఎంసి.గోపీ, పంచాయతీ కార్యదర్శి డి. మల్లేశ్వరి డ్రోన్ సర్వే ప్రక్రియ, హౌస్-హోల్డ్ మ్యాపింగ్, యాజమాన్య ధృవపత్రాల జారీ విధానం గురించి వివరించారు.

సోమలలో..

ఉపాధి హామీ జాబ్ కార్డుల పునః పరిశీలన

సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : ఉపాధి హామీ పనులలో భాగంగా హార్టికల్చర్ సంబంధించి 20 రకాల పండ్ల తోటలను రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటలను మూడు సంవత్సరాలలో కాపాడుకుంటే వాటి ద్వారానే జీవనోపాధి పొందవచ్చని చిత్తూరు డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో శనివారం ఉపాధి హామీ జాబ్ కార్డులపై పునః పరిశీలించాలని గ్రామసభను స్థానిక సర్పంచ్ డివి డిల్లెయ్య ఆధ్వర్యంలో ఏపీవో లలిత నిర్వహించారు. ఈకార్యక్రమానికి చిత్తూరు డ్వామా పీడీ రవికుమార్ హాజరై మాట్లాడుతూ చనిపోయిన వారు, గ్రామంలో లేనివారి, ఉపాధి హామీ కార్డులను డిలీట్ చేసి కొత్త ఉపాధి హామీ కార్డుల కోసం అప్లై చేసిన వారికి కొత్త కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామసభల ద్వారా డిలీట్ చేసిన వారి పేర్లను గ్రామస్తుల సమక్షంలో పేర్లను చదివి వినిపించి ఏదైనా పొరపాట్లు ఉంటే సరిచేయడం జరుగుతుందని, ఏదైనా సందేహాలుంటే తెలియజేయాలని కోరారు. గ్రామస్తులందరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి జోష్నా, టెక్నికల్ అసిస్టెంట్ గోపి, ఫీల్డ్ అసిస్టెంట్ యోగీశ్వర్ నాయుడు, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామసచివాలయంలో సర్పంచ్ శ్రీబాబు అధ్యక్షతన శనివారం ఉపాధి హామీ కొత్త కార్డుల పునఃపరిశీలపై గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ సభలో గ్రామపంచాయతీలో జాబ్ కార్డుల పరిశీలన, గత మూడు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న జాబ్ కార్డులు, మరణించిన వారి జాబ్ కార్డులు తొలగింపు, నూతన జాబ్ కార్డులు ఆమోదం, పని కోసం దరఖాస్తు స్వీకరణపై గ్రామసభ నిర్వహించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్ అలీ, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి జీవరత్నం, శాంత్‌కుమార్, నరసింహానాయుడు, పంచాయతీ సెక్రటరీ శిరీష, వీఆర్వో ప్రభావతి, ఉపాధి హామీ బిఎఫ్‌టి తిరుమలేశన్, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వివిధ రకాల వ్యర్థాల సేకరణ, నిర్వహణపై పారిశుద్ధ్య కార్మికులు సరైన అవగాహన కలిగి ఉండాలని నగరపాలక ఆరోగ్యాధికారి డాక్టర్ పి.లోకేష్ చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో శనివారం నగరపాలక పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు నగరపాలక సమావేశ మందిరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్వో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యర్థాల సేకరణలో పారిశుద్ధ్య కార్మికులే ఎంతో కీలకమని, తడి, పొడి వ్యర్థాలతో పాటు ప్రమాదకర ఇతర వ్యర్థాలను తగిన జాగ్రత్తలతో సేకరించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తగిన రక్షణ పరికరాలను ఉపయోగించాలని, పీపీఈ కిట్లను వినియోగించడం వల్ల కలిగే లాభాలను వివరించారు. వ్యర్థాల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెళకువలు, రక్షణ పరికరాల వాడకంపై ఏఐఎల్ఎస్జీ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ శ్రీనివాస్, రమాదేవి అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్

ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోండి..

ఎంపిడిఓ లక్ష్మీ కాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం ద్వారా పక్కా ఇల్లు నిర్మాణం కోసం లబ్ధిదారుల్లో అర్హుల గుర్తింపు, ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 30లోగా పూర్తి చేయాలని రామకుప్పం ఎంపిడిఓ లక్ష్మీ కాంత్ కోరారు. ఇందుకోసం కేవలం బియ్యం కార్డు, ఆధార్‌కార్డు ఉన్న ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని అన్నారు. అర్హత కలిగినవారందరు వెంటనే గృహ నిర్మాణల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం 60సంవత్సరాలకు పైబడిన వృద్దులు, వికలాంగులకు అవసరమైన సహాయ పరికరాలు ఉచితంగా పంపిణీ చేసేందుకోసం అలిమ్కో కంపెనీ ద్వారా ఈనెల 26న బుధవారం శాంతిపురం (మటం గ్రామం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరికరాల ఎంపిక కోసం ప్రత్యేక శిభిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రఘు, సత్యేంద్ర శేఖర్ తదితరులు ఉన్నారు.

స్వర్ణరథంపై మహాలక్ష్మి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4.20 గంటల నుండి ఆలయ మాడ వీధుల్లో ఈ ఉత్సవం నిర్వహించారు. కాంతులీనుతున్న స్వర్ణ రథంపై శ్రీ పద్మావతి అమ్మవారు విశేష స్వర్ణ, వజ్రాభరణాలను ధరించి భక్తులకు కనువిందు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని స్వర్ణరథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వి.వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఎస్ ఇ- 3 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. శనివారం ఉదయం సర్వభూపాల వాహన సేవ జరిగింది. టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 16 కళాబృందాలు 300 మంది కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు.

క్రైం న్యూస్

ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీ

ఇద్దరు మృతి

ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలు పాలైన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. సిఐ తెలిపిన వివరాల మేరకు గంగాధర నెల్లూరు మండలంలోని చిత్తూరు -పుత్తూరు జాతీయ రహదారిపై శనివారం పుత్తూరు వైపు నుండి బెంగళూరు కత్తిరిగుప్పం వైపుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు గంగాధర నెల్లూరు నుండి ద్విచక్ర వాహనంలో అరుణాచలం, దేసయ్య, ఈఆర్ కండీగకు చెందిన కుమార్‌ను జీడినెల్లూరు పంచాయతీలోని మోతరంగనపల్లి మలుపు వద్ద ఢీకొంది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అరుణాచలం (64), కుమార్ (51) అక్కడికక్కడే మృతిచెందగా, దేసయ్య (54) తీవ్రగాయాల పాలయ్యారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 వాహనం ద్వారా తీవ్ర గాయాలపాలైన దేసయ్యను, మృతిచెందిన అరుణాచలం, కుమార్ మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడి నెల్లూరు సిఐ శ్రీనివాసంతి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో

రూ.80వేలు జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందికి ఒక్కొక్కరికి రూ.10,000లు చొప్పున, మొత్తం రూ.80,000లు జరిమానా విధించబడింది. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 8మంది పట్టుబడ్డారు. వీరిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10,000ల చొప్పున మొత్తం రూ.80,000 జరిమానా విధించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని తప్పనిసరిగా పాటించాలని లేకుంటే భారీ జరిమానాలు తప్పవని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

ఎంసీ విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందించాలనే ఉన్నత ఆశయంతో మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం అత్యంత దుర్మార్గమని వైసిపి చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జి ఎంసీ విద్యానంద రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణంలో వైసిపి న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలను ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రైవేటుపరం చేయడం వల్ల అనేకమంది పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరం కావాల్సి వస్తుందన్నారు. కోటి సంతకాల సేకరణకు ప్రజల నుండి పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదుల అసోసియేషన్ నాయకులు సుగుణ శేఖర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ న్యాయవాది చంద్రశేఖర్, చక్రవర్తి, సివి.రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి అభివృద్ధికి కృషి చేయండి

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజలు మన్ననలు పొందిన పార్టీ అని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుహేబ్‌కు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం సుహేబ్ తిరుపతిలోని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి దృశ్యాలతో మండల వైసీపీ నాయకులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పలమనేరు మాజీ ఎంపీపీ ఆర్.రాజేంద్రన్, రాయలపేట పంచాయతీ వైసిపి కన్వీనర్ మంజునాథ్ రెడ్డి, వార్డు సభ్యులు హేమచంద్ర, రవికుమార్ రెడ్డి, అహ్మద్ బాష, ఇమామ్ వాలి పాల్గొన్నారు.

Notice Under Order 5,Rule 1&5 of C. P. C

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.57/2025

పటాన్ సైదల్లి ..... వాది

వర్సెస్

పటాన్ @ మొఘల్ మౌన ..... ప్రతివాది

ప్రతివాది :

పటాన్ @ మొఘల్ మౌన. W/o సైదల్లి,
D/o మొఘల్ నబు.
R/o డోర్ నెం.16- 409,M.G.Rవీధి,
చిత్తూరు, చిత్తూరు టౌన్, చిత్తూరు జిల్లా.

పై నెంబర్ నా వాది మీపై దావా పరిహార నిమిత్తం దావా దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు మీకు నోటీస్ నిమిత్తం తేదీ: 26-12-2025నకు వాయిదా వేసినారు. గాన మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై నీ అక్షేపణలు తెలియ చేసుకొనగలరు. లేనియెడల నీ పరోక్షమున దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 26-12-2025

ఇట్లు
మానం రామాంజనేయులు,
వాది తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా
సెల్:9032270354